

ఖజానా ఖాళీ..
గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటు పడుతోంది. 8లో▸



అభివృద్ధిపై దృష్టి సారించాలి
ఎన్నికల కోడ్ ముగిసినందున అభివృద్ధిపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. 8లో▸



‘గృహజ్యోతి’ కొందరికేనా?
గృహజ్యోతి పథకం అర్హులందరికీ అందడం లేదు. దరఖాస్తు చేసుకున్న వారిలో నగం మందికే లబ్ధి చేకూరుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

కొత్తగా రెండు డిగ్రీ కళాశాలలు

కొడంగల్: నియోజకవర్గానికి కొత్తగా రెండు డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయి. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్‌కు వరాల జల్లు కురిపిస్తోంది. ఇందులో భాగంగానే ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రారంభించే విధంగా అనుమతులు ఇచ్చారు. నియోజకవర్గంలోని కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాల, మద్దూరు మండల కేంద్రంలో కో ఎడ్యుకేషన్ డిగ్రీ కళాశాలను మంజూరు చేశారు. 2024 – 25 విద్యా సంవత్సరంలో ఈ రెండు కళాశాల్లో అడ్మిషన్లు తీసుకుంటారని అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. దోస్త్ అడ్మిషన్లలో భాగంగా సీట్లను భర్తీ చేస్తారని తెలిపారు.

విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్ అందాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



స్కూల్ యూనిఫామ్‌లను చూపుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు

అనంతగిరి: విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. శుక్రవారం అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసిన ఏకరూప దుస్తులను పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10వ తేదీ లోపు యూనిఫామ్‌లు పాఠశాలలకు చేరాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి, అడిషనల్ డీఆర్‌డీఓ సరోజ, డీపీఎంలు రాంమూర్తి, నర్సింలు, జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ -1 ప్రిలిమినరీకి పకడ్బందీ ఏర్పాట్లు

అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న రాహుల్‌శర్మ

అనంతగిరి: జిల్లాలో గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పరీక్ష విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం జరిగే పరీక్షకు సంబంధించిన విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పరీక్ష జరిగేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. అధికారులు హాల్ టికెట్లను క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టీజీ పీఎస్సీ రీజనల్ కోఆర్డినేటర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు రశీదులు మరవొద్దు



యాచారం పీఏసీఎస్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

యాచారం: ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు రశీదులు మర్చిపోవద్దని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో శుక్రవారం ఆమె తనిఖీలు చేపట్టారు. ఏఏ ఎరువులు ఉన్నాయి, విత్తనాలు నాణ్యమైనవే నిల్వ ఉంచారా.. ధరల పట్టిక ఉందా, రికార్డులు నమోదు చేస్తున్నారా.. తదితర వివరాలపై రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ఆయా గ్రామాల్లో మెట్ట పంటల విత్తనాలేస్తున్నారని తెలిపారు. వ్యాపారులు నాణ్యమైన విత్తనాలను రైతులకు విక్రయించాలని అన్నారు. ధరల పట్టిక దుకాణాల ముందే రైతులకు కనిపించేలా ఉంచాలని ఆదేశించారు. పత్తి విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లాలో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ ఉన్నారు.



నారాయణపేట జిల్లాలో కృష్ణా నదిపై నిర్మించిన జూరాల ప్రాజెక్టు

‘నారాయణపేట’కు మహర్దశ

ప్రాజెక్టు వ్యయాన్ని రెట్టింపు చేసిన సర్కార్
- నీటి నిల్వ సామర్థ్యం పెంచేలా అడుగులు
- లక్ష ఎకరాల సాగే లక్ష్యం
- చెరువుల అభివృద్ధికి మోక్షం



కంప చెట్లతో నిండిన కొడంగల్ చెరువు

కొడంగల్: ఉమ్మడి రాష్ట్రంతో పాటు పోరాడి సాధించుకున్న తెలంగాణలో కూడా కొడంగల్ నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైంది. పాలకుల కక్ష సాధింపు చర్యలతో కొడంగల్ ఉనికిని చరిత్ర పుటల్లో కనిపించకుండా చేయాలని భావించారు. అభివృద్ధికి ఆమడదూరంలో ఉంచారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నియోజకవర్గానికి మంచి రోజులు వచ్చాయి. తనదైన శైలిలో కొడంగల్ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారు. నాలుగు నెలల క్రితం రూ.5 వేల కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో పనులు ముందుకు సాగలేదు. కోడ్ ముగిసిన 24 గంటల్లోనే సీఎం మరో శుభవార్త చెప్పారు. రైతన్న దశ దిశ మారే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ప్రకటించారు. కొడంగల్ – నారాయణపేట ఎత్తిపోతల పథకం సామర్థ్యం పెంచారు. 2.1 టీఎంసీల నుంచి 4.022 టీఎంసీల వరకు నీటి నిల్వను పెంచడానికి వీలుగా చెరువులను అభివృద్ధి చేయనున్నారు. అంచనా వ్యయాన్ని కూడా రూ.2,945 కోట్ల నుంచి రూ.4,350 కోట్లకు పెంచారు. రెండు దశల్లో ఎత్తిపోతల పనులను పూర్తి చేసి లక్ష ఎకరాలకు సాగునీరు.. నారాయణపేట జిల్లాకు తాగునీటిని అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సాగు తాగునీటి అవసరాలను తీర్చే విధంగా ప్రాజెక్టు పనులకు రూపకల్పన చేశారు. ఇప్పటికే హెలికాప్టర్ ద్వారా లైడార్ సర్వే పూర్తి చేశారు. ఈ సర్వే పనులకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జీఓ 69కి జీవం పోశారు. నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతలకు రేవంత్ రెడ్డి పరిపాలనా అనుమతులు ఇచ్చారు.

పచ్చని మాగాణి కానున్న కొడంగల్

కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్షా ఎకరాలకు సాగునీరు, నారాయణపేటకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. మక్తల్ నియోజకవర్గంలోని ఊట్కూర్, మక్తల్ మండలాల్లో 25,786 ఎకరాలకు, నారాయణపేట నియోజకవర్గంలోని నారాయణపేట, ధన్వాడ, దామరగిద్ద మండలాల్లో 20,472 ఎకరాలకు, కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, దుద్యాల, కోస్గి, గుండుమాల్, మద్దూరు, కొత్తపల్లి మండలాల్లో 53,745 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. అంతేకాకుండా నారాయణపేట జిల్లా పరిధిలోని పలు గ్రామాలకు తాగునీరు అందిస్తారు.

రెండు దశల్లో పనులు

ఈ ప్రాజెక్టు పనులను రెండు దశల్లో పూర్తి చేయనున్నారు. ప్రాజెక్టు ప్రారంభం నుంచి చివరి భాగం వరకు ఇంజనీర్లు సమగ్రంగా అధ్యయనం చేశారు. భీమా పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటిని తీసుకుంటారు. మొదటి దశలో బూత్పూర్ జలాశయం నుంచి కానుకుర్తి వరకు నీటిని ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి జయమ్మ చెరువు.. అక్కడి నుంచి కానుకుర్తి చెరువుకు నీళ్లను మళ్లిస్తారు. ఇందుకోసం ఊట్కూరు, జయమ్మ చెరువు, కానుకుర్తి చెరువులను ఆధునీకరించి నీటి నిల్వ సామర్థ్యం పెంచుతారు. రెండో దశలో జాజాపూర్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట, హస్నాబాద్, కొడంగల్ చెరువులను ఆధునీకరిస్తారు. నీటి నిల్వ సామర్థ్యం పెంచుతారు. గ్రావిటీ కాలువలు, డిస్ట్రిబ్యూషన్ కాల్వలను నిర్మిస్తారు. అక్కడి నుంచి పంట పొలాలకు సాగు నీటిని అందిస్తారు.

రైతులకు ఎంతో మేలు



నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పథకం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. పొలాలకు సాగునీరు అందుతుంది. రైతులు ఆర్థికంగా బలోపేతం అవుతారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు రూ.5వేల కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఈ ఎత్తిపోతల పథకానికి నిధులు రెట్టింపు చేసి నీటి నిల్వ సామర్థ్యం పెంచడం వల్ల ఈ ప్రాంత రైతులకు మంచి జరుగుతుంది.

– ముద్దప్ప దేశ్‌ముఖ్, ఎంపీపీ, కొడంగల్

చెరువుకు మరమ్మతులు చేయాలి



కొడంగల్ చెరువుకు మరమ్మతులు చేయాలి. పూడిక తీయాలి, నీటి నిల్వ సామర్థ్యం పెంచాలి. చెరువు కింద 550 ఎకరాల ఆయకట్టు ఉంది. వందల మంది రైతులకు భూములు ఉన్నాయి. చెరువు నిండితే ప్రతి రైతుకూ మేలు జరుగుతుంది. పంటలు పండుతాయి. రైతులు ఆర్థికంగా బాగుపడతారు. చెరువు కట్టపై పగుళ్లు వచ్చాయి. ద్విచక్రవాహనాలు వెళ్లడానికి ఇబ్బంది ఉంది. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయాలి.

– శంకర్, కౌన్సిలర్, పాత కొడంగల్



తాండూరులో ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న అక్రమార్కులు

ప్రభుత్వ స్థలాలపై కన్ను

- పలుచోట్ల అన్యాక్రాంతం
- అనుమతులు లేకుండా నిర్మాణాలు
- పట్టించుకోని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు

తాండూరు: ప్రభుత్వ ఆధీనంలోని భూములు కబ్జాకు గురవుతున్నాయి. వీటి విలువ భారీగా పెరగడంతో అక్రమార్కుల కన్ను పడింది. ఇప్పటికే పెద్ద ఎత్తున అన్యాక్రాంతమయ్యాయి. రక్షించాల్సిన అధికారులు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. తాండూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా పట్టించుకోకపోవడం అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉన్నాయి. వీటిని రక్షించాల్సిన రెవెన్యూ అధికారులు ఆ దిశగా చర్యలేవీ తీసుకోవడం లేదు. 20, 21, 22, 23 వార్డుల్లోని స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. గాంధీనగర్ ప్రాంతంలోని సర్వే నంబర్ 1 నుంచి 6 వరకు ఉన్న ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. మరో వైపు తాండూరు – హైదరాబాద్ మార్గంలోని రాజీవ్ గృహకల్ప వద్ద రెండెకరాల అసైన్డ్ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణ

స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఉన్న ప్రభుత్వ భూమిని దశాబ్దాల క్రితం విజయ విద్యాలయ పాఠశాలకు కేటాయించారు. ఐదేళ్ల క్రితం వరకు ఈ స్కూల్ ఎయిడెడ్‌గా కొనసాగింది. ప్రభుత్వం ఈ విధానాన్ని ఎత్తేయడంతో ప్రైవేటు తరహాలోనే నిర్వహిస్తున్నారు. వారం రోజుల క్రితం ఈ భూమి (సర్వే నంబర్ 111)ని తాండూరుకు చెందిన ఓ వ్యక్తి తన ఆధీనంలోకి తీసుకున్నాడు. ఈ విషయమై స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

కబ్జాలను అడ్డుకుంటాం



తాండూరు మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేసినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తాం. గొల్ల చెరువు ప్రాంతంలోని సర్వే నంబర్ 111లో ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎవరైనా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాసరావు, ఆర్డీఓ, తాండూరు

పదవి ఉన్నా లేకున్నా ప్రజల్లోనే ఉంటా

చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: పదవి ఉన్నా లేకున్నా ఎప్పటికీ ప్రజల్లోనే ఉంటూ వారికి సేవ చేస్తానని చేవెళ్ల మాజీ ఎంపీ డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో తనకు ఓటేసిన ప్రతి ఒక్కరికీ, తనకోసం అహర్నిశలు పనిచేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఎన్నికల ఫలితాలు తమ అంచనాలకు భిన్నంగా వచ్చాయన్నారు. పార్టీకోసం, తన కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. ఫలితాలపై ఎవరూ చింతించాల్సిన పని లేదని.. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు కృషి చేద్దామని సూచించారు. ఫీనిక్స్ పక్షిలా కింది నుంచి పైకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

హామీలను వెంటనే అమలు చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

అనంతగిరి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే వాటా నిధుల కోసం పోరాటం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బీ వెంకట్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్‌లో సీపీఎం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని, అర్హులైన పేదలకు సాగు భూములు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందించాలని కోరారు. రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టులు నిర్మించి సాగు విస్తీర్ణం పెంచాలని సూచించారు. అలాగే ఉన్న ప్రాజెక్టుల నుంచి పంటలకు సరిపడా నీరు సరఫరా చేయాలని కోరారు. విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ధరణి కారణంగా అన్నదాతలు భూ సమస్యలు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రక్షాళన చేసి పేదలందరికీ న్యాయం జరిగేలా చూడాలని కోరారు. దళితులు, గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పోడు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్, జిల్లా నాయకులు వెంకటయ్య, రామకృష్ణ, శ్రీనివాస్, బుగ్గప్ప, చంద్రయ్య, సుదర్శన్, సత్యనారాయణ, మంగమ్మ, అనసూయ, సురేష్, నవీన్ కుమార్, సత్తయ్య, రఘురాం, శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



మంబాపూర్ బడిబాట కార్యక్రమంలో డీఈఓ రేణుకాదేవి తదితరులు

డీఈఓ రేణుకాదేవి

తాండూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని డీఈఓ రేణుకాదేవి అన్నారు. శుక్రవారం తాండూరు నియోజకవర్గంలోని పలు పాఠశాలలను సందర్శించారు. పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో చదివేలా పిల్లల తల్లిదండ్రులకు అవగహన కల్పించాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రైవేటు స్కూళ్ల కంటే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉన్నత ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తొందరపడొద్దు

- విత్తుకు ఇది అదను కాదు
- 60మి.మీ. వర్షపాతం దాటితేనే సాగుకు అనుకూలం
- ఇప్పటి వరకు రెండు మండలాల్లోనే 60 మి.మీ. నమోదు
- వ్యవసాయ శాఖ సూచన
- ప్రస్తుత సీజన్‌లో 5.97లక్షల ఎకరాల సాగుకు ప్రణాళిక
- అందుబాటులో ఎరువులు, విత్తనాలు



పొలాన్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

వికారాబాద్: వానాకాలం సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతన్నలు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేశారు. వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి అధికారులు, అనుబంధ శాఖల అధికారులతో సంప్రదించి ప్రణాళికలో అనుసరించాల్సిన విషయాలు చర్చించారు. గత వానాకాలం సీజన్‌లో సాగు విస్తీర్ణం ఎంత..? అందులో ఏయే పంటలు.. ఎంత మేర సాగు చేశారు.. ప్రస్తుత సీజన్‌లో ఏయే పంటల విస్తీర్ణం పెంచాలి.. ఏయే పంటలు తగ్గించాలి.. రైతులకు ఏయే అంశాలపై అవగాహన కల్పించాలి అనే విషయాలు చర్చించారు. డివిజన్లు, మండలాల వారీగా అందుబాటులో ఉంచాల్సిన ఎరువులపై కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో నకిలీ విత్తనాలు, పురుగు మందులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

60 మి.మీ. దాటితేనే విత్తుకోవాలి

జిల్లాలో వర్షాలు కురుస్తున్నా పూర్తి అదును అయ్యే వరకు విత్తనాలు వేయరాదని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. వర్షపాతం 60 మి.మీ. దాటితేనే విత్తుకోవాలన్నారు. ఇలా అయితేనే మొలకలు వస్తాయని అంటున్నారు. జిల్లాలో 20 మండలాలు ఉండగా కేవలం రెండు మండలాల్లో మాత్రమే 60 మిల్లీ మీటర్ల వర్షపాతానికి మించి నమోదైందని తెలిపారు. అత్యధికంగా కొడంగల్ మండలంలో 116 మిల్లీ మీటర్లు కాగా బంట్వారంలో 61.9 మి.మీ. నమోదైంది. ఈ రెండు మండలాల్లో మినహా మిగతా చోట్ల విత్తుకు అదను కాలేదని తెలిపారు.

సాగు విస్తీర్ణం 5.97 లక్షల ఎకరాలు

జిల్లాలో ప్రస్తుత సీజన్‌లో 5.97 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. గతేడాది 2.61 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు చేయగా.. ఈ ఏడాది 2.63లక్షల ఎకరాల్లో సాగు చేయవచ్చని అంచనా వేశారు. కంది పంట 1.50 లక్షల ఎకరాల్లో, వరి 1.10 లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 50,450 ఎకరాలు, పెసలు 13,000 ఎకరాలు, మినుములు 5వేల ఎకరాలు, జొన్నలు 2500 ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. వరి, మొక్కజొన్న, జీలుగ, జనుము, సోయాబీన్, కంది విత్తనాల కొరత లేకుండా చూస్తున్నారు. జిల్లాలో అధిక విస్తీర్ణంలో పత్తి పంట సాగయ్యే అవకాశం ఉన్నందున అవసరం మేరకు విత్తనాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం 50 నుంచి 70 శాతం వరకు విత్తనాలు అందుబాటులో ఉంచారు. డీఏపీ 17,719 మెట్రిక్ టన్నులు, యూరియా 32,329 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 19,877 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 3,658 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 1,854 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అంచనా వేశారు.

విత్తన కొరత లేదు



జిల్లాలో సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాం. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలి. రసీదులు తప్పనిసరిగా తీసుకోవాలి. పూర్తిస్థాయిలో వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు నాటుకోవాలి.

– గోపాల్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి

గూగుల్‌ను నమ్మొద్దు.. బాలాజీని నమ్మండి

భక్తులకు చిలుకూరు బాలాజీ దేవాలయ అర్చకుడు రంగరాజన్ సూచన



మొయినాబాద్: చిలుకూరు బాలాజీ దేవాలయానికి వచ్చే భక్తులు గూగుల్‌ను నమ్మకండి.. దాన్ని నమ్మితే హుస్సేన్‌సాగర్‌లోకే పోతామని అర్చకుడు రంగరాజన్ అన్నారు. శనివారం, ఆదివారం చిలుకూరు బాలాజీ దేవాలయం క్లోజ్డ్ (మూసివేత) అంటూ గూగుల్‌లో పెట్టడంపై శుక్రవారం ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చిలుకూరు దేవాలయం శనివారం, ఆదివారం క్లోజ్డ్ అని గూగుల్ వాడికి ఎవరు చెప్పారని ప్రశ్నించారు. భక్తులెవరూ గూగుల్ ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. గూగుల్‌ని నమ్మితే శనివారం, ఆదివారం భక్తులెవరూ చిలుకూరుకు రాలేరన్నారు. 4జీ, 5జీని నమ్మితే అధోగతి అని.. భక్తులు బాలాజీని నమ్మాలని చెప్పారు.

క్లుప్తంగా

మహిళను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు


రమేశ్

పరిగి: మహిళను హత్యచేసిన వ్యక్తికి జీవిత ఖైదు శిక్షను విధిస్తూ వికారాబాద్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తీర్పు ఇచ్చారు. పట్టణ కేంద్రానికి చెందిన బిచ్చపు రమేశ్ మున్సిపల్ పరిధిలోని తుంకలగడ్డకు చెందిన శానమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. 2020 ఫిబ్రవరి 27వ తేదీన శానమ్మ భర్త ఇంట్లో లేని సమయంలో రమేశ్ గొడవ పడి రాడ్డుతో తలపై కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త యాదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేసి నిందితున్ని రిమాండ్‌కు పంపించారు. ఆధారాలను పరిశీలించి శుక్రవారం జడ్జి నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.1000 జరిమానా లేదంటే 6 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు.

బాలికకు వైద్య పరీక్షలు

పోలీసుల అదుపులో నిందితుడు

బొంరాస్‌పేట: బహిర్భూమికి వెళ్లిన ఆరేళ్ల చిన్నారిని ఓ వ్యక్తి అపహరించి, రాత్రి వరకు పొలంలో దాచిపెట్టిన సంఘటన గురువారం రేగడిమైలారంలో చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనకు పాల్పడిన నిందితుడు అంజిలప్పను గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇదే విషయమై బాలిక పెద్దనాన్న శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. విచారణ ముమ్మరం చేశారు. ఈ మేరకు చిన్నారి తల్లిదండ్రులు, గ్రామస్తులతో మాట్లాడి, సంఘటన వివరాలపై ఆరా తీశారు. వైద్య పరీక్షల నిమిత్తం చిన్నారిని వికారాబాద్‌కు తరలించారు.

పిడుగుపాటుకు పశువులు మృత్యువాత


కుస్మసముద్రంలో మృతిచెందిన ఎద్దు వద్ద విషాదంలో బాధిత రైతు

కుల్కచర్ల: అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. శుక్రవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో పిడుగుపాటు సంభవించింది. కుల్కచర్ల మండలం కుస్మసముద్రం గ్రామంలో చెన్నయ్యకు చెందిన రెండు ఎద్దులు పిడుగుపాటుకు గురై మృతిచెందాయి. అదేవిధంగా చౌడాపూర్ మండలం లింగస్‌పల్లిలో చెట్టు కింద ఉన్న రైతు లాలుకు చెందిన 5 గేదెలు పిడుగుపాటుకు మృత్యువాతపడ్డాయి. ప్రకృతి ప్రకోపం కారణంగా నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. బాధిత రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రతి ధాన్యం గింజను కొంటాం

డీసీఎస్‌ఓ రాజేశ్వర్

అనంతగిరి: కొనుగోలు కేంద్రాలను వచ్చి తడిసిన ప్రతి ధాన్యం గింజనూ కొంటామని జిల్లా సివిల్ సప్లై అధికారి రాజేశ్వర్ పేర్కొన్నారు. ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు, రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకుని తగు చర్యలు తీసుకుంటామని ఆయన వివరించారు. ఈ మేరకు ఓ ప్రకటనలో శుక్రవారం ఆయన తెలిపారు. ఎలాంటి తరుగుదల పెట్టరాదని ఒకవేళ ఎవరైనా మిల్లర్లు ఇబ్బంది చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో అకాల వర్షాలకు పొలంలో తడిసిపోవడంతో దోమ, బాసుపల్లి, నాగసముందర్‌తో పాటు జిల్లాలోని వేరే మండలాల్లో కూడా వరి ధాన్యం రంగు మారిందన్నారు. ఈ ధాన్యాన్ని రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాల వద్దకు తెచ్చినపుడు అక్కడున్న ఇన్‌చార్జిలు సంబంధిత రైతులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ప్రతి ధాన్యం గింజను మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు.

ఖజానా ఖాళీ.. పాలనకు లొల్లి


దౌల్తాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం


పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

- గ్రామ పంచాయతీలను వేధిస్తున్న నిధుల కొరత
- నామమాత్రంగా ప్రత్యేకాధికారుల పాలన

దౌల్తాబాద్: చిన్న గ్రామ పంచాయతీలు ఏర్పడిన తర్వాత నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి నెలా నిధులు మంజూరు చేసేవి. ఆయా నిధుల సాయంతో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పంచాయతీలలో పనులు చక్కగా చేయించి అందని మన్ననలు పొందేవారు. సర్పంచుల పాలనాకాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు లేకపోవడం, పార్లమెంట్ ఎన్నికల ప్రకటన నాటి నుంచి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే 15వ ఆర్థిక సంఘం నిధుల నిలిచిపోయాయి. మార్చి నాటికి వసూల్ చేసిన ఇంటి పన్నులను జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసిన కార్యదర్శులు ఏ అవసరం వచ్చినా ఖాతాలో నిధులను వినియోగించుకుంటూ కొంతకాలం వెళ్లదీశారు.

పేరుకుపోయిన అప్పులు

గ్రామ పంచాయతీలలో అరకొరగా ఉన్న నిధుల నిల్వలను విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపునకు వినియోగిస్తున్నారు. ఇతర ఏ అవసరం ఉన్నా అప్పులు చేయక తప్పని పరిస్థితి. ఇంతేకాకుండా గ్రామపంచాయతీలలో గతంలో పనిచేసిన సర్పంచులు తమ పదవీకాలంలో చేసిన పనులకు నిధుల చెల్లింపు నేటికీ బకాయిగానే ఉండిపోయింది. కొన్ని పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం నాటికి కార్యదర్శులు జీపీలలో ఒక్కరూపాయి లేకుండా వాడుకున్నారు. రోజూ పారిశుద్ధ్య పనులలో భాగంగా ఇంటింటి చెత్త సేకరణ కోసం వినియోగించే ట్రాక్టర్ డీజిల్ కొనుగోలు సమస్యగా మారింది. వీటికి తోడు వేసవిలో నీటి ఎద్దడి నివారణ పేరుతో పైప్‌లైన్ చేతిపంపులకు మరమ్మతుల పేరిట బిల్లులను కొన్ని గ్రామల్లో కార్యదర్శులు కాజేశారు. నర్సరీలకు నెట్‌షెడ్, ఎరువులు, నీటిసౌకర్యం వంటివన్నీ అప్పులు చేసి సమకూర్చుతున్నామని కార్యదర్శులు చెప్పుకొస్తున్నారు. వర్షాలు సమీపిస్తున్నందున బ్లీచింగ్ పౌడర్ సిద్ధం చేయాలని, మురుగు కాల్వలు శుభ్రం చేయాలని, నీటి నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి మట్టితో పూడ్చివేయాలన్న ఆదేశాలు కార్యదర్శులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

సిబ్బందికి జీతాలు చెల్లించని దుస్థితి

సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీలలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ వారి పాలన నేడు నామమాత్రంగానే కనిపిస్తుంది. ఫైళ్లపై సంతకాలు చేయడానికి మినహా పంచాయతీల నిర్వహణ, అభివృద్ధిలో వారి భాగస్వామ్యం శూన్యమేనని చెప్పాలి. ప్రస్తుతం పంచాయతీలలో నిధుల లేమి సమస్యగా మారడం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొనడంపై ప్రత్యేకాధికారులు దృష్టి సారించడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరం.

వానాకాలంలో ఇబ్బంది

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పారిశుద్ధ్య పనులు అటకెక్కితే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం లేకపోలేదు. అన్ని సక్రమంగా సాగిన సమయంలోనే దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడేవారు. అటువంటిది పారిశుద్ధ్య పనులు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు.

నిధుల కొరత వాస్తవమే

గ్రామ పంచాయతీలకు నిధుల కొరత వాస్తవమే. దీంతో నిర్వహణ భారంగా మారింది. చాలా మంది కార్యదర్శులు పంచాయతీల ఈ విషయంలో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీల్లో కార్మికుల వేతనాల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– రవీందర్, ఎంపీఓ, దౌల్తాబాద్

అభివృద్ధిపై దృష్టి సారించాలి

కొడంగల్ మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ జగదీశ్వర్‌రెడ్డి


సమావేశంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కొడంగల్: మున్సిపల్ పాలకవర్గం సాధారణ సమావేశాన్ని శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ జగదీశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎజెండాలో ఉన్న పలు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అభివృద్ధి పనులు, నీటి సరఫరా, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించారు. మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన పనుల గురించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ ముగిసినందున అభివృద్ధిపై దృష్టి సారించాలని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంటురోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు శిథిలావస్థకు చేరిన పాత భవనాల్లో నివాసం ఉండరాదన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ బలరాం నాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై చర్యలు

క్లినిక్‌ను సీజ్ చేసిన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌యాదవ్


క్లినిక్‌ను సీజ్ చేస్తున్న వైద్యాధికారులు

తాండూరు: పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో ఓ ప్రైవేట్ క్లినిక్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌యాదవ్ సీజ్ చేశారు. రెండు రోజుల క్రితం చైతన్యనగర్ మాజీ సర్పంచ్ అంజయ్య పాదం, మెడ నొప్పి ఉందని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లారు. అక్కడ ఆయన వైద్యం తీసుకున్నారు. దీంతో అంజయ్యకు వైద్యం వికటించి నరం చచ్చుబడింది. దీంతో జిల్లా వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీందర్‌యాదవ్ తన సిబ్బందితో కలిసి మంబాపూర్‌లో ఆర్‌ఎంపీ వైద్యుడు శ్రీనివాస్ క్లినిక్‌ను తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ నిర్వహించడంతో పాటు క్లినిక్‌లోనే పలు రకాల మందులు నిల్వ ఉంచుకొన్నాడని గుర్తించారు. దీంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కాలం చెల్లిన మందులతో ప్రజల అనారోగ్యానికి గురి చేసిన ఆర్‌ఎంపీ వైద్యులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

మట్టి కొట్టుకుపోయి.. పైపులు తేలి

ప్రమాదకరంగా వీరన్న వాగు కల్వర్టు

మర్పల్లి: మండల పరిధిలోని సిరిపూరం వీరన్న వాగుపై ఇటీవల కురిసిన వర్షానికి కల్వర్టుపై ఉన్న మట్టి కొట్టుకుపోయి, పైపులు తేలి ప్రమాదకరంగా మారింది. గ్రామానికి సమీపంలో వీరన్న వాగు దాటేందుకు గత రెండేళ్ల క్రితం తాత్కాలికంగా పైపులు వేసి మట్టి పోశారు. దీంతో అప్పట్లో కల్వర్టుపై నుంచే వాహనాలు సైతం రాకపోకలు సాగించేవి. ఇటీవల కురిసిన వర్షాలకు పైపులపై పోసిన మట్టి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో కల్వర్టుపై నుంచి సమీపంలో ఉన్న మోమిన్‌పేట్ మండలం రావులపల్లి, కోల్‌కుందా, ఇతరాత్ర గ్రామాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పొలాలకు ట్రాక్టర్లపై, ఎడ్ల బండ్లపై ఎరువులు తీసుకుపోవాలంటే రైతులు భయపడుపతున్నారు. గ్రామంలో ఎవరైనా మృతి చెందితే ఇదే కల్వర్టుపై నుంచి శవాన్ని తీసుకువెళ్లాల్సి ఉంటుదని మండల సమాఖ్య హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ చైర్మన్ శివశంకర్‌గౌడ్ సాక్షితో వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులపై మట్టి వేసి శాశ్వతంగా కల్వర్టు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


కల్వర్టుపై కొట్టుకుపోయిన మట్టి

కనుల పండువగా రథోత్సవం


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నాయకులు


రథాన్ని లాగుతున్న భక్తులు

కోత్లాపూర్‌లో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్ గ్రామ శివారులో శ్రీ రేణుక ఎల్లమ్మ జాతరలో భాగంగా శుక్రవారం రథోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. నెల రోజుల పాటు భక్తిశ్రద్ధలతో ఈ జాతర కొనసాగించారు. గ్రామంలోని నవీన్‌రెడ్డి ఇంటి నుంచి అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో మహిళలు బోనాలు సమర్పించారు. తర్వాత రథాన్ని ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి గ్రామోత్సవం చేశారు. అంతకుముందు స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన్ని ఆలయ కమిటీ ఈవో శేఖర్‌గౌడ్‌తో పాటు నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణరెడ్డి, మాజీ సర్పంచు సాయిలు, మాజీ ఆలయ కమిటీ చైర్మన్ సందీప్‌రెడ్డి, నాయకులు జైదీప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, గోపాల్, సురేష్‌లతో పాటు యువకులు పాల్గొన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. రథోత్సవానికి తాండూరు ప్రాంతంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

రైతులకు అందని రాయితీ

- సబ్సిడీ యంత్రాలు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు
- పదేళ్లుగా ఒక్కో పథకానికి మంగళం
- పెట్టుబడులు పెరిగి ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

కడ్తాల్: రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో అందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక వ్యవసాయానికి తగినట్టుగా సాంకేతిక పరికరాలు అందడం లేదని వాపోతున్నారు. పదేళ్లుగా రాయితీ పథకాలను ప్రభుత్వాలు ఒక్కొక్కటిగా అటకెక్కించాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ద్వారా అందించే సబ్సిడీ పరికరాలు నేడు రైతులకు అందకపోవడంతో రైతుల ఆశలపై నీళ్లు చల్లినట్టుగా మారింది. వ్యవసాయ యాంత్రీకరణ పథకాలు ప్రభుత్వం పక్కకు పెట్టడంతో అన్నదాతల పరిస్థితి అధ్వానంగా మారింది. ఎనిమిదేళ్లుగా సబ్సిడీ పరికరాలు రాకపోవడంతో రైతుల పరిస్థితి ఇబ్బందిగా మారింది. కాంగ్రెస్ పాలనలోనైనా రైతులకు రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పనిముట్లు అందజేయాలని రైతులు కోరుతున్నారు.

రైతులకు నిరాశ

ప్రస్తుతం కడ్తాల్ మండల పరిధిలో 24 గ్రామ పంచాయతీల్లో 14వేలకు పైగా రైతులు, సుమారు 33వేల ఎకరాలపైగా సాగు భూమి ఉంది. గతంలో వ్యవసాయశాఖ నుంచి రైతులకు ఉపయోగపడే పరికరాలను ప్రభుత్వం సబ్సిడీపై అందించేది. డ్రిప్ పరికరాలు, కేజీ వీల్స్, కల్టివేటర్, రోటో వేటర్, తైవాన్ స్ప్రేలు, నాగళ్లు, మినీ ట్రాక్టర్లు, టార్పాలిన్ కవర్లు తదితర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేసేవారు. ప్రస్తుతం ఆ పథకాలు ఏవీ లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశతో ఉన్నారు.

నిలిచిపోతున్న పథకాలు

వ్యవసాయశాఖ ద్వార రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతున్నాయి. 2006–07 నుంచే వ్యవసాయ పథకాలకు కోత పడుతూ వస్తోంది. రైతుకు ఉపయోగపడే నాగళ్లు, ఇతర పనిముట్లు 2014 నుండే నిలిచిపోయాయి. 2016–17 ఆర్థిక సంవత్సరం వరకు అందుబాటులో ఉన్న 10 నుంచి 12 రకాల పనిముట్లు, ఆ తర్వాత కనుమరుగయ్యాయి. యాంత్రీకరణ, రాయితీ పథకాలు ఒక్కొక్కటిగా నిలిచిపోతుండడం మరో వైపు మంజూర య్యే యూనిట్లు నామమాత్రంగా ఉంటున్నాయి. రైతులకు నిత్యావసరంగా మారిన టార్పలిన్ కవర్లు సైతం తగ్గించారు.

30 వరకు డీఈఎల్ ప్రవేశ దరఖాస్తులు

అనంతగిరి: ప్రభుత్వ, ప్రైవేట్ డీఈఎల్ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 30 వరకు దరఖాస్తులు చేసుకోవాలని వికారాబాద్ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రామాచారి ఒక ప్రకనటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష జూలై 10న నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవులు మృతి

షాబాద్: విద్యుదాఘాతంతో రెండు పాడి ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని మస్‌మర్రి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మస్‌మర్రి గ్రామానికి చెందిన పొట్టిగారి నర్సింలుకు చెందిన పాడి ఆవులు మేత మేస్తూ పాఠశాల సమీపంలోకి వెళ్లాయి. అక్కడున్న విద్యుత్ స్తంభం వద్ద ఉన్న వైర్లు ప్రమాదవశాత్తు ఆవుకు తగిలాయి. దీంతో రెండు ఆవులు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. మృతి చెందిన ఆవుల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని పశుపోషణ చేసుకుంటున్న తనను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతు కోరుతున్నాడు.

వానరానికి విద్యుత్ షాక్

కేశంపేట: గ్రామంలో తిరుగుతున్న క్రమంలో ఓ వానరం విద్యుదాఘాతంతో అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ ఘటన శుక్రవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం వానరం ఓ ఇంటి పై నుంచి మరో ఇంటి పైకి దూకుతున్న సమయంలో విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో అపస్మారక స్థితికి చేరుకుంది. గుర్తించిన గ్రామస్తులు సాయిలు, హరికృష్ణ, బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి శివాజీ సమీపంలోని పశువుల ఆస్పత్రికి తరలించారు. డాక్టర్ నివేదిత వానారాన్ని పరీక్షించి చికిత్స చేశారు. అనంతరం ఆమనగల్లు రేంజ్ అటవీశాఖ అధికారులకు కోతిని అప్పగించారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి


మల్కాపూర్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో మొక్క నాటుతున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని మల్కాపూర్ జెడ్పీ హెచ్‌ఎస్‌లో ఆయన మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న కాలుష్యంతో భూతాపం పెరిగి అనర్థాలు ఏర్పడుతున్నాయని ఇందుకు కారణం అడవులు అంతరించిపోవడమేనన్నారు. కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మండల పరిధిలోని ముడిమ్యాల, పలుగుట్ట, మల్కాపూర్, కేసారం, తోల్‌కట్ట తదితర గ్రామాల పరిధిలో విస్తరించి ఉన్న అటవీ ప్రాంతాన్ని సైతం మరింత పచ్చదనంతో పెంపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముడిమ్యాల పీఏసీఎస్ చైర్మన్ గోనే ప్రతాప్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు బి.రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, నరేందర్‌గౌడ్, అశోక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురన్దాస్, ఇంద్రసేనారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింలు, రమేశ్‌గౌడ్, రమేశ్, జబ్బార్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్‌పై పాము

- లిబర్టీ వద్ద కలకలం
- గంటపాటు ట్రాఫిక్ జామ్



హిమాయత్‌నగర్: నగరంలోని లిబర్టీ చౌరస్తాలో ఓ తాచుపాము కలకలం సృష్టించింది. శుక్రవారం సాయంత్రం చౌరస్తా సిగ్నల్ వద్ద ఉన్న వేప చెట్టుపై మొదట పాము ప్రత్యక్షమైంది. అక్కడి నుండి కేబుల్ వైర్ల సహాయంతో ట్రాఫిక్ సిగ్నల్‌పైకి చేరింది. నిత్యం ట్రాఫిక్‌తో రద్దీగా ఉండే సిగ్నల్ వద్ద ఒక్కసారిగా పాము కనిపించడంతో వాహనదారులు ఖంగుతిన్నారు. ఆ పాము ఎక్కడ మీద పడుతుందో అని ఎక్కడికక్కడ తమ వాహనాలను నిలిపివేశారు. దీంతో సుమారు గంట పాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. కొద్దిసేపటికి సిగ్నల్ పోల్ సహాయంతో కిందకు చేరిన పాము.. పక్కనే ఖాళీగా ఉన్న బిల్డింగ్ సెల్లార్‌లోకి వెళ్లింది. దీంతో వాహనదారులు, పోలీస్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా కొందరు ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధించారు.

అధిక ధరలకు విత్తనాల విక్రయం

దుకాణ యజమానిపై కేసు


పత్తి ప్యాకెట్లను సీజ్ చేస్తున్న అధికారులు

చేవెళ్ల: అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తున్న ఓ దుకాణ యజమానిపై పోలీసులకు కేసు నమోదు చేశారు. ఈ ఘటన మండల పరిధిలోని ఎన్కేపల్లి చౌరస్తాలో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన ప్రకారం.. స్థానిక శ్రీసాయి ఏజెన్సీ సీడ్స్, ఫర్టిలైజర్ దుకాణ యజమాని లక్ష్మారెడ్డి పత్తి విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు వ్యవసాయాధికారులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో మండల వ్యవసాయాధికారి తులసి రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఎమ్మార్పీ రూ.860 ఉన్న పత్తి విత్తనాల ప్యాకెట్‌ను రూ.1,200కు అమ్ముతున్నట్లు గుర్తించిన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. తనిఖీల్లో ఆయన రూ.120 పెచ్చించి పత్తి విక్రయాలు చేస్తున్నట్లు రశీదులు అభ్యమయ్యాయి. దీంతో దుకాణం యజమానిపై కేసు నమోదు చేశామన్నారు.